క్లుప్తంగా

ఆకట్టుకున్న సైన్స్ అంశాల త్రీడి చిత్ర ప్రదర్శన



రేపల్లె రూరల్: విద్యార్థులు విజ్ఞాన శాస్త్రం, గణిత శాస్త్రంపై భయాందోళనలు వీడి ఆరోగ్య వంతమైన వాతావరణంలో ఇష్టపడి చదువుకోవాలని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అపర్ణ అన్నారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైన్స్‌కు సంబంధించిన ఫస్ట్ మెన్ ఆన్ ది మూన్, అవర్ గేలాక్సీ, డైనోసార్, ది షార్క్ వంటి పలు అంశాలపై త్రీడి చిత్ర ప్రదర్శన ఇచ్చారు. సైన్స్ యాత్ర నిర్వాహకుడు సందీప్‌రాజు వాటిని వివరించారు. ఒక అంశాన్ని కంటితో చూసి నేర్చుకుంటే విద్యార్థుల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతుందని కరస్పాండెంట్ అపర్ణ అన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 30న శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని కమిషనర్ విజయసారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన అధ్యత వహిస్తారని, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

మట్టి ఖర్చులు అందజేత



పేరలి(కర్లపాలెం): పేరలి పంచాయతీ మేకలవానిపాలేనికి చెందిన జోగి డానియల్(58) అనే వ్యక్తి శుక్రవారం గుండెపోటుతో చెందాడు. అంత్యక్రియలకు మట్టి ఖర్చుల నిమిత్తం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పేరలి బాలకృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో రూ.5వేలు నగదు వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, ట్రస్ట్ కార్యదర్శి శ్రీనివాసరావు మృతుడి కుటుంబానికి అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వారి వెంట ఉన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



పిట్టలవానిపాలెం: యూటీఎఫ్ 2024 సంవత్సర క్యాలెండర్, డైరీలను ఎంఈఓలు ఉయ్యూరి వెంకటేశ్వరరావు, రాజారత్నం శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రహంతుల్లా మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు మక్బుల్, శ్రీనివాసరావు, బర్కతున్నీసా, కాఖిబుద్దీన్, మహమద్, సుభాని పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

కర్లపాలెం: పేరలి గ్రామంలో నాటుసారా విక్రయాలపై ఎస్ఈబీ పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. గొడపాలెం రామాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఏమినేని రామయ్య నుంచి ఐదు లీటర్ల నాటు సారాను గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. రామయ్యను అరెస్ట్ చేసి, అతనిపై కేసు నమోదు చేశామన్నారు. సెబ్ ఎస్ఐ ప్రభుదాసు,సిబ్బంది పాల్గొన్నారు.

బిడారు దిబ్బలో చోరీ

కర్లపాలెం: దుండివారిపాలెం పంచాయతీ బిడారుదిబ్బ గ్రామంలోని ఓ ఇంటిలో చోరీ ఘటనపై ఆలస్యంగా ఫిర్యాదు అందింది. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. ఏట్రవారిపాలెం వీఆర్వో సుభాని తల్లి దిల్‌దార్ బిడారుదిబ్బలో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి ఆమె నిద్రించిన తర్వాత.. దొంగలు ఇంటిలోకి ప్రవేశించి లోపల ఉన్న ట్రంకు పెట్టెను ఎత్తుకెళ్లారు. స్థానిక పొలాల్లో దానిని పగులగొట్టి అందులో ఉన్న రూ.50వేలు నగదు, జత బంగారు పోగులు, సెల్ ఫోన్ తీసుకెళ్లారని.. వీఆర్వో సుభాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుష్ఠు బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

తెనాలి అర్బన్: జిల్లా క్షయ నివారణ అధికారుల సూచన మేరకు పాత ప్రభుత్వ వైద్యశాలలో టీబీ యూనిట్‌లో చికిత్స పొందుతున్న 27 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు శుక్రవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గుంటూరుకు చెందిన ఐటీసీ, నాట్కో సంస్థల సహకారంతో వీటిని పంపిణీ చేస్తున్నట్లు సూపర్‌వైజర్ పి.రవికుమార్ చెప్పారు. కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, లక్ష్మీ భార్గవి, దిలీప్, పావని, వనజ, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం హోరా హోరీగా



కొల్లూరు బాలుర ఉన్నత పాఠశాలలో టాస్ వేస్తున్న అధికారి



బేతపూడిలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



కబడ్డీ క్రీడాకారులతో పీవీపాలెం ప్రజా ప్రతినిధులు



పేటేరులో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రం

రేపల్లె రూరల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. మండలంలోని పలు సచివాలయాల పరిధిలో బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులు, పట్టణ, గ్రామీణ యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. బేతపూడి, పేటేరు, కారుమూరు సచివాలయాల పరిధిలో బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. సచివాలయ సిబ్బంది పోటీలను పర్యవేక్షించారు. మైదానాల్లో క్రీడాకారులకు తాగునీరు, అల్పాహారంతో పాటు ఏఎన్ఎంలతో ప్రథమ చికిత్స కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు..

కొల్లూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మండలంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. శుక్రవారం కొల్లూరు బాలురోన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలు జరిగాయి. మండల స్థాయి పోటీలకు రెండు జట్లు ఎంపికైనట్లు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు తెలిపారు. కొల్లూరు సచివాలయం 1, 2, 3, పెసర్లంక సచివాలయాల పరిధిలో నమోదు చేసుకున్న అన్ని జట్లకు పోటీలు పూర్తవ్వగా, మిగిలిన సచివాలయాల పరిధిలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించాల్సి ఉందని ఆయన చెప్పారు.

కబడ్డీ ప్రారంభం..

పిట్టలవానిపాలెం: పిట్టువారిపాలెం సచివాలయం పరిధిలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ యేట్ర అశ్వినీరెడ్డి పోటీలను ప్రారంభించారు.

నాటకరంగానికి శ్రీరామమూర్తి సేవలు ఎనలేనివి



నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

తెనాలి: నంది నాటకోత్సవాల్లో ప్రప్రథమంగా తెనాలికి నంది బహుమతిని తీసుకొచ్చిన నటుడు రావినూతల శ్రీరామమూర్తి బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు వక్తలు నివాళులర్పించారు. రూరల్ మండలం అంగలకుదురుకు చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి, కవి, రచయిత, నటుడు రావినూతల శ్రీరామమూర్తి ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో టీసీ కాలనీలోని సంఘ భవనంలో శుక్రవారం శ్రీరామమూర్తి సంస్మరణ సభను నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. అభ్యుదయ కళాసమితి అధ్యక్షుడిగా, సుప్రసిద్ధ సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ దగ్గర సహాయకుడిగా పనిచేసిన శ్రీరామమూర్తి ఆకస్మిక మరణం జీర్ణించుకోలేనిదని పలువురు కళాకారులు విచారం వ్యక్తంచేశారు. అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, కన్నెగంటి మధు, ఆర్అండ్‌బీ రాజు, దేవిశెట్టి కృష్ణారావు, పినపాటి సురేష్‌బాబు, చిట్టూరి సీతారామయ్య, కొండముది రమేష్, కనపర్తి మధు, ఎం.అంబదాసు, వేము రామరాజు పాల్గొన్నారు. తొలుత శ్రీరామమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

మిర్చి యార్డులో ముగిసిన సద్ది వితరణ



సద్ది స్వీకరిస్తున్న మాలధారులు

కొరిటెపాడు: గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో మాలధారణ స్వాములకు గత 45 రోజుల నుంచి నిర్విఘ్నంగా కొనసాగిన సద్ది వితరణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శరణు ఘోషతో మిర్చి యార్డు ప్రాంగణం మార్మోగింది. గణపతి హోమం, అయ్యప్ప నామ సంకీర్తనలతో పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంతో భక్తి భావం వెల్లి విరిసింది. సద్ది వితరణ ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమంలో సేవ చేసిన వారికి శాసన మండలి విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో వస్త్ర దానంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ అత్యంత వైభవోపేతంగా పడిపూజ, నిత్య సద్ది వితరణ కొనసాగించి, సమాజ హితాన్ని కాంక్షించిన దేవస్థానం కమిటీ, మిర్చి ఫ్యామిలీని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం ఆలయ కమిటీ నిర్వాహకులు, మిర్చి ఫ్యామిలీ మెంబర్స్ కొత్తపల్లి శివసాంబిరెడ్డి, కోటా సాంబశివరావు, కుర్రి సాంబిరెడ్డి, కొత్తూరి సుధాకర్, లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, యలమంచిలి పుల్లారావు, వి.జి.టి.నారాయణరావు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, పాదిలి శ్రీనివాసరావు, గోపు శ్రీనివాసరెడ్డి, కార్మిక నేత ఎం.శ్రీనివాసరెడ్డి, బొలిశెట్టి వెంకట రమేష్‌కుమార్, డొంకెన బలరాం పాల్గొన్నారు.

హిందూ కళాశాలలో స్మారక ప్రతిభా పురస్కారోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో శుక్రవారం బద్దెపూడి ముకుందరావు స్మారక ప్రతిభా పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వాణిజ్య విభాగ ఆధ్వర్యంలో పాఠ్యాంశాలతో పాటు సాంస్కృతిక పరమైన అంశాల్లో విద్యార్థులకు పోటీల్ని నిర్వహించారు. విజేతలతో పాటు చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని షేక్ అఫ్రీన్‌బానుకు రూ.ఐదువేల నగదు బహుమతిని బద్దెపూడి ముకుందరావు కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.లక్ష్మీ బద్రీనాథ్, డాక్టర్ బి. లీలామోహన్, రాజీవ్, దత్తప్రసాద్, సోమశేఖర్, టి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, కామర్స్ ఇన్‌చార్జ్ ఐ. శాంతిలత పాల్గొన్నారు.

దేశంలో సగరులను ఒకే పేరుతో పిలవాలి

ట్రస్ట్ నేషనల్ కో–ఆర్డినేటర్ హరీష్ చౌహాన్



మాట్లాడుతున్న హరీష్ చౌహాన్

తాడేపల్లిరూరల్: భారతదేశంలో వివిధ పేర్లతో పిలువబడుతున్న సగరులను సంఘటితం చేసి సగరులను, సగర భగీరథ అనే ఒకే పేరుతో పిలవాలని ట్రస్ట్ నేషనల్ కో ఆర్డినేటర్ హరీష్ చౌహాన్ అన్నారు. ఢిల్లీలో ఫిబ్రవరి 29వ తేదీన శ్రీ సగర భగీరథ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సగరుల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన భగీరథ జన్ కళ్యాణ్ బస్సు యాత్ర శుక్రవారం మంగళగిరి గంగా భగీరథ సగర కమ్యూనిటీ హాల్ వద్దకు చేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్ట్ నేషనల్ కో ఆర్డినేటర్ చౌహాన్ మాట్లాడుతూ దేశంలో సుమారు 20 కోట్ల మంది ఉన్న సగరులు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి పోయారన్నారు. వివిధ రాష్ట్రాలలో సగరులను రకరకాల పేర్లతో పిలువబడుతున్నారని, సగరులను ఒకే పేరుతో పిలవాలని ఢిల్లీల్లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశంలోని సగరులను ఒక తాటిపైకి తెచ్చేందుకు సెప్టెంబర్ 27న ఢిల్లీలో బస్సుయాత్ర ప్రారంభించి, అన్ని రాష్ట్రాలు యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. 11 మంది బృందంతో నిర్వహిస్తున్న బస్సు యాత్ర ఫిబ్రవరి 10వ తేదీతో పూర్తి చేసి, 29వ తేదీన ఢిల్లీలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గంగా భగీరథ సగర సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు, నాయకులు జ్యాటు ఏడుకొండలు, కర్నాటి శివ సత్యనారాయణ, ధూపాటి రామకోటేశ్వరరావు, కలవకొల్లు వెంకయ్య, కటారి విష్ణుమూర్తి, గండికోట అచ్చయ్య, సంగళం ప్రసాద్, కగ్గా శ్రీనివాసరావు, గండికోట హేమ కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి

గుంటూరు మెడికల్: కాంట్రాక్టు ఉద్యోగుల క్రమ బద్ధీకరణ వేగవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ నూతన పీఆర్సీ 2020 స్కేల్స్ వర్తింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులలో ఆనందాన్ని, వారి కుటుంబ సభ్యుల్లో నూతన వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి కె.వి.ఎస్. శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లా షాఖాద్రి, జిల్లా ఉపాధ్యక్షుడు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల రూరల్ సీఐ బదిలీ

బాపట్లటౌన్: బాపట్ల రూరల్ సీఐ జి. వేణుగోపాలరెడ్డి నెల్లూరు జిల్లా గూడూరు సర్కిల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు.. ఆయనకు రేంజ్ ఐజీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి.

యోగాతో మానసిక వికాసం

తెనాలిఅర్బన్: నేటి యాంత్రిక జీవితంలో ఒత్తిడిని అధిగమించటంతో పాటు మానసిక వికాసం పొందేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ శిక్షకులు ఎంఆర్‌కే మూర్తి, టి.సుబ్బారావులు పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన యోగా వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ప్రతిరోజు చేయడం వలన మానసిక ఉల్లాసం, ఏకగ్రత వంటివి అలవడతాయని చెప్పారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ టి.జ్యోతిబస్, కె.కల్యాణ్ చక్రవర్తి, ఫణికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం



పాత గుంటూరు: పట్టణంలోని సంపత్ నగర్ శ్రీ రామనామ క్షేత్రంలో 97వ శ్రీ రామకోటి మహోత్సవం, వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. క్షేత్రం గౌరవ అధ్యక్షులు పోలిశెట్టి హరిప్రసాద్, ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు క్రోసూరి మురళీ కృష్ణమాచార్యులు వరపూజ చేసి, మేళతాళాలతో ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికకు చేర్చారు. విశ్వక్సేనారాధనతో ప్రారంభించి మాంగల్య పూజ అనంతరం మంగళసూత్ర ధారణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న ప్రసాద వితరణ చేశారు. శ్రీ రామదాసు కీర్తనలను చింతలపాటి రామమహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి ఆలపించారు. అనంతరం సాయంత్రం జరిగిన పోటీల్లో పాల్గొన్న బాలబాలికలకు బసవరాజు జయశంకర్ బహుమతులు ప్రదానం చేశారు. గరుడ వాహనంపై సీతారాముల కల్యాణ మూర్తుల నగరోత్సవం కనుల పండువగా నిర్వహించారు. లీలాసుందరి మాట్లాడుతూ శనివారం ఉదయం సహస్ర నాగవల్లీ దళార్చన, సాయంత్రం నగరోత్సవం ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలను కె. రామచంద్ర ప్రభు, కె.శాంతి భూషణ్, డాక్టర్ వి. రాఘవరావు పర్యవేక్షించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో మాస్టర్ వెంకటేశ్వరరావు

నిజాంపట్నం: జాతీయస్థాయి తైక్వాండో పోటీ ల్లో నిజాంపట్నం విద్యార్థులు పాల్గొంటున్నట్లు బోధిధర్మ తైక్వాండో అకాడమీ ఫౌండర్, ఇంటర్నేషనల్ మాస్టర్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్న విద్యార్థులతో నిజాంపట్నంలో శుక్రవారం ఆయన మాట్లాడారు.ఈ నెల 30, 31వ తేదీల్లో రేపల్లె పట్టణంలో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు తమ విద్యార్థులు 20 మంది ఎంపికైనట్లు తెలిపారు.ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని పలు బహుమతులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామపెద్దలు పోటీలకు వెళ్లనున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు సాహసోపేతం

వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న సమన్వయకర్త అశోక్‌బాబు

వెల్లటూరు(భట్టిప్రోలు): పేదల ప్రాణం విలువ తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కార్డు చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంచడం సాహసోపేత నిర్ణయమని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన వెల్లటూరులో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి, వారి కష్ట సుఖాలను తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న సేవలను ఆరా తీశారు. అనంతరం విలేకరులతో అశోక్‌బాబు మాట్లాడారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసి ఏడాదికి రూ.10.30 కోట్లు మాత్రమే ఖర్చు పెడితే.. జగనన్న ప్రభుత్వం ఒక్కో ఏడాదికి రూ. 4,100 కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. ప్రతి లబ్ధిదారునికి నూతన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డును పంపిణీ చేస్తారని, ఆ కార్డులో లబ్ధిదారుల సమాచారం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరి మొబైల్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించి, ఆరోగ్యశ్రీ సేవలను వివరించాలని ఏఎన్ఎంలు, వలంటీర్లను ఆదేశించారు. జనవరి ఒకటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు కుందేటి రమేష్, మద్దుల గిరిధర్, దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు వెలగపూడి సరస్వతమ్మ



సరస్వతమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఫోరం సభ్యులు

బాపట్ల అర్బన్: బాపట్లలో మహిళా విద్యా వ్యాప్తికి వెలగపూడి సరస్వతమ్మ చేసిన కృషి మరువలేనిదని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. సరస్వతమ్మ జయంతిని శుక్రవారం ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ 1915లో ప్రారంభించిన యువతి విద్యా నిలయం నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగా అభివృద్ధి చెందిందన్నారు. కళాశాల అభివృద్ధికి సరస్వతమ్మ కృషి వెలకట్టలేనిదన్నారు. పట్టణం నడిబొడ్డున అర ఎకరం స్థలాన్ని విద్యా సంస్థకు విరాళంగా ఇచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.వేదవతి, అధ్యాపకులు ఉదయ భాస్కర్, జాన్ సైదా, శ్రీనివాసరావు, సుమతి, సంయుక్త, సువర్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

మంచు దుప్పటి



భట్టిప్రోలు-బాపట్ల-వెల్లటూరు రహదారిలో



లైట్లతో వెళ్తున్న లారీ

భట్టిప్రోలు: పొగ మంచు దట్టంగా కమ్ముకుంటోంది. ఉదయం 8 గంటలు దాటిన మంచు దుప్పటి వీడటం లేదు. దీనికి తోడు మండలంలో శుక్రవారం చలి గాలులు వీయడంతో ప్రయాణికులు ఒకింత ఇబ్బంది పడ్డారు. రహదారులపై ఉదయం కూడా లైట్ల సహాయంతో నెమ్మదిగా వాహనదారులు వెళ్తున్నారు.

పన్నులు చెల్లించేందుకు రెండు రోజులే గడువు

రాత్రి 8 గంటల వరకు పని చేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: వడ్డీ లేకుండా ప్రస్తుత అర్ధ సంవత్సరానికి గానూ పన్నులు చెల్లించడానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉందని, పన్ను చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 ఆదివారం చివరి రోజు సెలవు అయినప్పటికీ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయన్నారు. జనవరి 1 నుంచి పన్ను బకాయిపై వడ్డీ పడుతుందని పేర్కొన్నారు. పన్ను చెల్లింపునకు వీలుగా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు అదనంగా నగరంలోని భారత్ పేట 140 సచివాలయం, వసంతరాయపురం 148 సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్డులోని 106 సచివాలయాల్లో కూడా ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, నీటి, ఖాళీ స్థలం పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

విద్యార్థి కేంద్రంగా బోధన సాగాలి: డీవైఈఓ



మాట్లాడుతున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: తరగతి గదిలో విద్యార్థి కేంద్రంగా అత్యుత్తమ విద్యాబోధన సాగాలని గుంటూరు డీవైఈవో పి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో ఉర్దూ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణా శిబిరాన్ని సందర్శించిన డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తూ, వృత్తి నైపుణ్యం పెంపునకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థులకు మాతృభాషతో పాటు ఆంగ్లభాషలోనూ పాఠ్యాంశాలను మిర్రర్ ఇమేజ్ టెక్నాలజీతో అందించిందని చెప్పారు. తద్వారా విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించేందుకు ఊతం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల హెచ్ఎం ఎస్వీఆర్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఆర్ఎం కార్యాలయంలో సువిధ కేంద్రం ప్రారంభం

నూతన విభాగాన్ని పరిశీలించిన డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి సువిధ కేంద్రం ఎంతో ఉపయోగమని డీఆర్ఎం ఎం.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డివిజన్ కార్యాలయంలో నూతనంగా సువిధ కేంద్రాన్ని డీఆర్ఎం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నూతన సిబ్బంది, పెన్షనర్ల ఫిర్యాదులను, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలు ఉంటుందని పేర్కొన్నారు. సువిధ కేంద్రం ఏర్పాటుకు డివిజన్ సీనియర్ డిపిఓ షేక్ షాహబాజ్ హనూర్ కృషి అభినందనీయం అని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారానికి వీలుగా గడువు నిర్ణయించాలని సూచించారు. డివిజన్‌లోని ప్రధానమైన అంశాలను డిజిటల్, ప్రచారాని అవసరమయ్యే ఇతర కార్యక్రమాలను ప్రదర్శించడానికి కార్యాలయ ప్రాంగణంలో పోస్టర్లు, ప్రదర్శనలకు బదులుగా త్వరలో 4 టీవీ డిజిటల్ స్క్రీన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన పెన్షన్ అదాలత్‌లో రిటైర్డ్ సిబ్బందికి వాట్సాప్ గ్రూప్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ నంబర్‌ను తీసుకొచ్చినందుకు వ్యక్తిగత శాఖను డీఆర్ఎం అభినందించారు. సెలవు రికార్డు డిజిటలైజేషన్‌ను దాదాపుగా పూర్తి చేసినందుకు ఆర్‌పీఎఫ్ శాఖను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ షేక్ షాహబాజ్ హనూర్, ఏడీఆర్ఎం సైమాన్, వివిధ విభాగాల అధికారులు ప్రభాకర్‌రాజు, జె.వి.అనూష, అమూల్య బి.రాజ్, బి.లక్ష్మణ్, దినేష్ రెడ్డి, కె.కమలాకర్, హరప్రసాద్ పాల్గొన్నారు.